క్లుప్తంగా

నేడు అవగాహన సదస్సు

నంద్యాల(అర్బన్): నాణ్యమైన మాంసం వినియోగంపై స్థానిక జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయ భవనంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా పశువైద్యాధికారి నరసింహుడు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఏపీ మాంస అభివృద్ధి సంస్థ లిమిటెడ్ చైర్మన్ శ్రీరాములు ముఖ్య అతిథిగా హాజరయ్యే సదస్సుకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు.

నేడు కేంద్ర బృందం రాక

ఉయ్యాలవాడ : మండలంలోని అల్లూరు గ్రామానికి కేంద్రం బృంద సభ్యులు ఈఆర్ ప్రదీప్‌కుమార్ పైత్రే, సంతోష్‌కుమార్ ప్రధాన్ శుక్రవారం రానున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ సచివాలయ పరిధిలో 2019-20, 20-21, 21-22 ఆర్థిక సంవత్సరాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు పరిశీలిస్తారని చెప్పారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు ఏ మేరకు అందుతున్నాయనే విషయాలను నేరుగా వారినే అడిగి తెలుసుకుంటారని పేర్కొన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి స్థాయి సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి

దొర్నిపాడు:డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎస్‌ఐ తిరుపాల్ సూచించారు. గురువారం డ్రగ్స్ నిర్మూలనపై స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు, చాకరాజువేముల గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గంజాయి, కొకైన్, హెరాయిన్ తదితర డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ బారిన పడకుండా విద్యార్థులు తల్లిదండ్రులకు సూచించాలన్నారు. డగ్స్ వినియోగిస్తే ఆరు నుంచి ఒక సంవత్సరం వరకు జైలు శిక్ష తప్పదని, అలాగే అమ్మినా, కలిగి ఉండినా, ప్రోత్సహించినా 10 నుంచి 20 ఏళ్ల జైలు శిక్ష పడే అవకాశముందని స్పష్టం చేశారు. హెచ్‌ఎం అహ్మద్ హుసేన్, ఏఎస్‌ఐలు ప్రతాప్‌రెడ్డి, రంగయ్య పాల్గొన్నారు.

5న వెంకటరామిరెడ్డి రాక

నంద్యాల(అర్బన్): ఆంధ్రప్రదేశ్ ఎంప్లాయీస్ యూనియన్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి ఈనెల 5న నంద్యాలకు రానున్నారని ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ భాస్కర్ గురువారం తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై చర్చించేందుకు టెక్కె మార్కెట్‌యార్డులో జరిగే సమావేశంలో పాల్గొంటారని, ఉద్యోగులందరూ హాజరు కావాలని కోరారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

శిరివెళ్ల: పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజును గెలిపించాలంటూ సీపీఎం, విద్యార్థి సంఘాల నాయకులు గురువారం కస్తూర్బా, మోడల్ స్కూల్, యర్రగుంట్ల కళాశాలలో ప్రచారం చేశారు. సీపీఐ ఆళ్లగడ్డ తాలూకా కార్యదర్శి భాస్కర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు అధ్యాపకులను కలిసి మద్దతు కోరారు. ఏఐఎస్ఎఫ్ మండల నాయకుడు మస్తాన్, గోవర్ధన్, ఎస్టీయూ, యూటీఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గౌరవ వేతనాలు మంజూరు

శిరివెళ్ల: మండలంలోని ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనాలు మంజూరయ్యాయని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. గతేడాది ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు 17 మందికి ఒకొక్కరికి నెలకు రూ.3 వేల చొప్పున మంజూరయ్యాయని ఆ మొత్తాన్ని నేరుగా వారి ఖాతాలో జమ చేశామని చెప్పారు.

ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలి

నంద్యాల(అర్బన్): జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్లను తక్షణమే లబ్ధిదారులకు స్వాధీనం చేయాలన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలకు ఇస్తున్న రూ.1.80లక్షలు ఏ మాత్రం సరిపోవడం లేదన్నారు. నాయకులు బాబాఫకృద్దీన్, సుంకయ్య, రాధాకృష్ణ, ప్రసాద్, రాముడు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి పనులు కల్పించాలి

దొర్నిపాడు: జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఉపాధి హామీ పనులు కల్పించాలని ఎంపీడీఓ నాగఅనసూయ ఉపాధి హామీ పథకం సిబ్బందికి సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో వెంటనే పనులు ప్రారంభించాలని, కూలీలకు సరిపడ పనులు గుర్తించాలని ఆదేశించారు. ఈసీ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

గోస్పాడు: పరిశుభ్రతతోనే ఆరోగ్యం చేకూరుతుందని వైద్యాధికారి గోపాల్ తెలిపారు. గురువారం స్థానిక మోడల్ స్కూల్ లోని విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని, భోజన సమయంలో చేతులను శుభ్రపరచుకోవాలని సూచించారు. ఏవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.హాస్టల్‌లోని 82 మంది బాలికలకు వైద్య పరీక్షలతో పాటు హిమోగ్లోబిన్ స్థాయి రక్తపరీక్షలు చేసి రక్తహీనత ఉన్న వారికి మందులు అందజేశారు.సరైనపౌష్టికాహారం తీసుకోవాలన్నారు.

మతసామరస్యానికి ప్రతీక తిక్కస్వామి ఉరుసు

- ఈనెల 2-6వ తేదీ వరకు ఉత్సవాలు
- నేడు ఉరుసు, 4,5,6 తేదీల్లో జార్తలు
- భారీగా తరలిరానున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సాయిబాబా నగర్‌లో వెలసిన శ్రీహజరత్ సయ్యద్‌షా షహన్‌షా అవులియా చిస్తివుల్ ఖాదరి ఖుద్దహు (తిక్కస్వామి) ఉరుసు ఈనెల 2 నుంచి 6వ తేదీ వరకు 5రోజుల పాటు జరుగుతాయని దర్గా ధర్మకర్త చాంద్‌బాషా తెలిపారు.గురువారం ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఏటా పల్లె వాతావరణాన్ని తలపిస్తూ సాయిబాబా నగర ప్రాంతంలో ఉత్సవాలకు పట్టణ పరిసర గ్రామీణ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారన్నారు. షెహన్‌షా వలి.. తిక్కస్వామిగా అవతరించి 1945లో మరణించిన స్థలం వద్దనే ఈ దర్గాను నిర్మించారన్నారు. స్వామి వారు ఎన్నో మహిమలు చూపారని స్థానికులు పేర్కొంటారు. తాను చనిపోయే ముందు రోజు..రేపు తాను మరణిస్తానని స్థల యజమానికి తెలియజేసి తనువు చాలించారు. అనారోగ్యం బారిన పడిన వారిని తిక్కస్వామి తాకితే వారు ఆరోగ్యవంతులుగా మారేవారని, ఆయన తిరుగాడిన దుకాణంలో వ్యాపారం అద్భుతంగా సాగేదని స్థానికులు పేర్కొంటున్నారు. దీంతో ఆయన మహిమలను గుర్తు చేసుకుంటూ 1945 నుంచి ఏటా ఉరుసు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 2వ తేదీన గంధం వేడుకలు, 3న ఉరుసు, 4, 5, 6 తేదీల్లో జార్తలు నిర్వహిస్తామన్నారు. వేడుకల్లో భాగంగా స్వామి వారికి ఫాతెహాలు, పూలదండల సమర్పణ, గంధ సమర్పణ, అన్నదాన కార్యక్రమం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఫకీర్లు స్వామి వారి మహత్యాన్ని పాటల రూపంలో వినిపిస్తారని, 3న రాత్రి ఖవ్వాలి పోటీలు ఏర్పాటు చేశామని వివరించారు.



ప్రత్యేక అలంకరణలో తిక్కస్వామి సమాధి

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

రుద్రవరం: మండలంలోని కోటకొండలో గ్రామ సర్పంచ్ డేగాని వెంకటేష్ గురువారం రూ.20లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పర్యటించిన సమయంలో స్థానికులు సీసీ రోడ్లు వేయించాలని కోరడంతో ఆయన ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా రూ.30లక్షలు మంజూరు చేయించారన్నారు. ఆ నిధుల్లో నుంచి రూ.20లక్షలతో గ్రామంలోని కుమ్మరి వీధిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ వెంకటరాముడు, గ్రామ పెద్దలు రామకృష్ణ, సంజీవకర్ణ, శివుడు, అంకన్న, తలారి వెంకటరమణ,కుమ్మరి సుబ్బయ్య, పెద్ద వీరభద్రుడు, పాములేటి,ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. కాగా..మరో రూ.10లక్షలు కోటకొండ మజరా గ్రామమైన కే.కోత్తూరులో సీసీ రోడ్డు నిర్మించేందుకు కేటాయించామని తెలిపారు. ఇక్కడ పనులు పూర్తయిన వెంటనే అక్కడ పనులు చేపడతామని వివరించారు.



కోటకొండలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన దృశ్యం

సంక్షేమ పథకాలతో జీవనోపాధి మెరుగు

ఆళ్లగడ్డ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిరుపేదల జీవనోపాధి మెరుగు పడేందుకు దోహదపడుతున్నాయని ఎంపీపీ వీరభద్రుడు అన్నారు. మండల కేంద్రం చాగలమర్రిలోని మల్లెవేముల సీసీ రోడ్డుకు రూ.22 లక్షలతో గ్రామ సర్పంచ్ తులసమ్మతో కలిసి గురువారం భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఈ రహదారి గుంతల మయంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా రూ.22లక్షలు మంజూరు చేయించారని, త్వరలో పనులు పూర్తిచేసి రోడ్డును వినియోగంలోకి తెస్తామని చెప్పారు. నాయకులు బాబులాల్, కుమార్‌రెడ్డి, ముల్లా రఫీ తదితరులున్నారు.



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

లబ్ధిదారులకు అవగాహన కల్పించండి

నంద్యాల(రూరల్): గృహ నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని నంద్యాల హౌసింగ్ డీఈ వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం మండలంలోని పెద్దకొట్టాల గ్రామంలోని జగనన్న లే అవుట్‌లో జరుగుతున్న గృహ నిర్మాణాలను ఎంపీడీఓ భాస్కర్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో ఏర్పాటు చేసిన సమావేశం డీఈ మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు పొందిన వారు, ఇళ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. ముఖ్యంగా బేస్ లెవల్ పూర్తి చేసిన వారు ఉగాది లోపు నిర్మాణాలు పూర్తి చేసేలా కృషి చేయాలని ఆదేశించారు. మండల హౌసింగ్ ఏఈ రాజరఘువర్మ, పంచాయతీ కార్యదర్శి భార్గవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ వెంకటేశ్వర్లు

ప్రమాదాల నివారణ అందరి బాధ్యత



డ్రైవర్‌ను సన్మానిస్తున్న డీఎస్పీ, ఆర్‌టీఓ

నంద్యాల(వ్యవసాయం): ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని డీఎస్పీ మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆర్టీసీ గ్యారేజీ ఆవరణలో రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు సమావేశం ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డీఎస్పీ, నంద్యాల జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి శ్రీకాంత్ హాజరై మాట్లాడుతూ ప్రయాణికుల భద్రతే ముఖ్యమని, వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడానికి డ్రైవర్లు కృషి చేయాలని సూచించారు. అతివేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని, మీపైన మీ కుటుంబం ఆధార పడి ఉందనే విషయాన్ని గమనంలో ఉంచుకోవాలని చెప్పారు. అనంతరం నంద్యాల జిల్లాలోని ఏడు డిపోల్లో 24 మంది డ్రైవర్లకు ప్రోత్సాహక బహుమతులను అందజేసి సత్కరించారు. అసిస్టెంట్ డిపో మేనేజర్ మద్దిలేటినాయుడు, రాజశేఖర్‌రెడ్డి, మహేంద్రుడు, తిరుపతయ్య, శశిభూషణ్, యూనియన్ నాయకులు సుబ్బరాజు, వైఎస్సార్ సీపీ జిల్లా ఎంప్లాయీస్ చైర్మన్ అల్లాబకాష్ పాల్గొన్నారు.

ముమ్మరంగా రోడ్డు పనులు

శిరివెళ్ల: శిరివెళ్ల, రుద్రవరం, ఆళ్లగడ్డ మండలాల గ్రామీణ లింక్ రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పీఎంజీఎస్‌వై కింద రూ.7.3 కోట్లతో 13.7 కి.మీ. పరిధిలో రోడ్డు నిర్మాణం జరుగుతోంది. శిరివెళ్ల, పేరూరు, చిలకలూరు, యర్రగుడిదిన్నె, మందలూరు గ్రామాల సమీపంలో ఈ రోడ్డు పనులు జరుగుతున్నాయి. రోడ్డు పనులకు 2022 మే నెలలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి భూమి పూజ చేశారు. ప్రస్తుతం 13.7 కి.మీ. పరిధిలో మెటల్ రోడ్డు పనులు పూర్తియయ్యాయి. రోడ్డు మార్గంలోని రుద్రవరం మండలంలోని పేరూరు-యర్రగుడిదిన్నె మధ్య గల 2కి.మీ. మేర తారు రోడ్డు పనులు జరిగాయి. రోడ్డు నిర్మాణం పూర్తయితే రైతులకు ఎంతో ప్రయోజనం ఉంటుంది. అలాగే శిరివెళ్ల నుంచి ఆళ్లగడ్డ వరకు బైపాస్ రోడ్డు ఏర్పడుంది. దీంతో సమయం, దూరం తగ్గి ప్రజలకు కలిసి వస్తుంది. పీఆర్ ఏఈ విజయకుమార్ మాట్లాడుతు శిరివెళ్ల- చందలూరు రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయని, మెటల్ రోడ్డు పనులు ఇటీవల పూర్తయ్యాయని చెప్పారు. పేరూరు నుంచి యర్రగుడిదిన్నె వరకు తారు రోడ్డు వేశామని త్వరలో రోడ్డు పనులు పూర్తియవుతాయని తెలిపారు.



పేరూరు- యర్రగుడిదిన్నె మధ్య రోడ్డు వేస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

ఆళ్లగడ్డ: జాతీయ రహదారుల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆళ్లగడ్డ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం చాగలమర్రి నుంచి నంద్యాలకు వెళ్లే రహదారుల్లో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్‌లను గుర్తించారు. ప్రమాద మలుపుల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే గుర్తించిన బ్లాక్ స్పాట్లు ఎర్రగుడిదిన్నె మొట్ట టీ జంక్షన్, నల్లగట్ల గ్రామం, పెద్ద కందుకూరు మెట్ట, గూబగుండం జంక్షన్‌ల వద్ద వేగాన్ని నిరోధించడానికి బారికేడ్‌లు, రోడ్డుపై టైర్లు, రోడ్లకు ఇరువైపుల అడ్డుగా ఉన్న కొమ్మలను, పొదలను తొలగించారు. రంబుల్ స్ట్రిప్స్, సైన్ బోర్డులు ఏర్పాటు చేశారు.ఆయన మాట్లాడుతూ వాహనదారులు పరిమితికి మించి వేగంతో వెళ్లరాదని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని సూచించారు. రూరల్ ఎస్‌ఐ నరసింహులు, సిబ్బంది ఉన్నారు.



ఎరుగుడుదిన్నె వద్ద జాతీయ రహదారిపై బారికేడ్లు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

‘ఉపాధి’ని సద్వినియోగం చేసుకోవాలి

ఉయ్యాలవాడ : జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ రవిప్రకాష్ సూచించారు. గురువారం మండలంలోని పెద్దయమ్మనూరు, ఆర్.జంబులదిన్నె గ్రామాల్లో కూలీలతో మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న వారందరూ ఉపాధి పనుల్లో పాల్గొని జీవనాన్ని మెరుగు పరుచుకోవాలని కోరారు. ఉదయాన్నే పని ప్రదేశానికి చేరుకోవాలని నిర్ణీత కొలతల ప్రకారం పనులు చేసి రూ. 257 వేతనాన్ని పొందాలని చెప్పారు. కూలీలను పనుల్లో పాల్గొనేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించవలసిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు.టెక్నికల్ అసిస్టెంట్ షరీఫ్, ఓబుళరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏపీఓ రవిప్రకాష్

స్పాట్ బిల్లింగ్‌పై దృష్టి సారించండి

కర్నూలు(రాజ్‌విహార్): నెలవారీ విద్యుత్ బిల్లులు తీసే స్పాట్ బిల్లింగ్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి సూచించారు. గురువారం ఆయన కింది స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్లులు జారీ చేయడంలో ఎలాంటి సమస్య తలెత్తరాదని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి మీటర్‌ను డిజిటల్ యాప్ ద్వారా స్కాన్ చేసి రీడింగ్ చేయాలని చెప్పారు. డోర్ లాక్ బిల్లింగ్‌లో డోర్ లాక్ ఆప్షన్ ఉండేలా చూడాలని, మీటర్‌లో సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు సంబంధితన అధికారులు స్పందించాలన్నారు. బిల్లుల జారీ పూర్తయ్యాక బిల్లులు 100 శాతం రాబట్టాలన్నారు. దీనిపై ఆపరేషన్స్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్లు, ఏఈలు ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకొని లక్ష్యం చేరాలన్నారు. పాత బిల్లులు, మొండి బకాయిలను ఎలాగైనా రాబట్టాలని, ప్రభుత్వ శాఖలకు ఎప్పటికప్పుడు ఆయా అధికారులతో మాట్లాడి వసూలు అయ్యేలా చూడాలని సూచించారు. అంతరాయం, ఇతర సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే స్పందించి పునరుద్ధరించాలని సూచించారు. ఫిర్యాదులు వచ్చిన వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి పరిష్కారం చూపాలని, వీటిపై నిర్లక్ష్యం వహించడం తగదన్నారు.

‘పది’లో మంచి ఫలితాలు సాధించండి

రుద్రవరం: కష్టపడి చదివి పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని జిల్లా సమగ్ర శిక్ష ఎంఐఎస్ ప్లానింగ్ అండ్ ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్ మనోహర్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. స్థానిక ప్రత్యేక అవసరాలు గల పిల్లల శిక్షణా కేంద్రాన్ని (భవిత కేంద్రం) గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని రికార్డులు,పిల్లల హాజరు, పరిసరాల శుభ్రత వంటివి పరిశీలించారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాల, కేజీబీవీని పరిశీలించి అక్కడ పదో తరగతి పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంఈఓ వెంకటరామిరెడ్డి ఉన్నారు.



భవిత కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న మనోహర్‌రెడ్డి

‘ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్’

నంద్యాల(అర్బన్): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేకమైనదని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నరసింహులు, డివిజన్ కార్యదర్శి శంకర్ విమర్శించారు. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో గురువారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 2023-24 బడ్జెట్‌లో ధరల పెరుగుల నియంత్రణకు ఎలాంటి సూచనలు చేయకపోవడంతో భవిష్యత్‌లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గించడం దారుణమన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఎటువంటి మార్గాలు చూపించలేదని, వ్యవసాయ రంగ కేటాయింపులు అంతంత మాత్రంగానే ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం త్వరలో జరగబోయే రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బడ్జెట్ రూపకల్పన చేశారని విమర్శించారు. విద్యార్థి, యువజన, కార్మిక, రైతు కూలీల సంక్షేమం గురించి బడ్జెట్‌లో ఎక్కడ ప్రస్తావించకపోవడం ఆశ్చర్యకరమన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రఫీ, చౌడప్ప, మహమ్మద్ మౌలీసా, అజీస్, రవి, హరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరసింహులు

సమాజ నిర్మాణానికి ఆడపిల్లల చదువు అవసరం



ఉచిత మెటీరియల్‌ను చూపుతున్న దృశ్యం

నంద్యాల(సిటీ): సమాజ నిర్మాణానికి ఆడపిల్లల చదువు ఉపయోగపడుతుందని రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ డాక్టర్ నౌమాన్ తెలిపారు. దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లో ఉందన్నారు. స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయ మైనార్టీ విద్యార్థులకు ఉర్దూ లాంగ్వేజ్, ఉచిత మెటీరియల్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారిణి నాగసువార్చల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నౌమాన్ మాట్లాడుతూ ఏపీ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ అందించిన ఉచిత మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ హెప్సిబా మాట్లాడుతూ మైనార్టీ విద్యార్థులకు మెటీరియల్ అందజేయడం హర్షనీయమని, మున్ముందు మరింత చేయూతనివ్వాలని కోరారు. కార్యక్రమంలో ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అబ్దుల్‌అజీజ్, జిల్లా నాయకులు షమీమ్ బాను, అంజాద్ షరీఫ్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో అధిక దిగుబడులు

గడివేముల: పంటలను సాగు చేసే ముందు విత్తన శుద్ధి చేయడంతో అధిక దిగుబడులు సాధించవచ్చునని నంద్యాల వ్యవసాయ శాస్త్రవేత్తలు నరసింహా, అరుణ్‌కుమార్‌లు తెలిపారు. గురువారం మండల పరిధిలోని గడిగరేవుల గ్రామంలో అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నంద్యాల ఏడీఏ రాజశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆముదం, జొన్న పంటలలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. చిరుధాన్యాలు సాగు చేస్తే మంచి దిగుబడి ఉంటుందన్నారు. మినుము పంటలో రసం పీల్చేపరుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతులు సస్యరక్షణ చర్యలతో పాటు వ్యవసాయాధికారులు సలహాలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ హేమసుందర్‌రెడ్డి, సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



జొన్న పంట సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

సోలార్ భూముల పరిశీలన

పాణ్యం: మండలంలోని కందికాయపల్లె గ్రామంలో గ్రీన్‌కో సోలార్ పరిశ్రమకు కేటాయించనున్న భూములను గురువారం నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి పరిశీలించారు. గ్రామ సమీపంలో ఉన్న 980 ఎకరాల భూమిని సోలార్ కంపెనీ వారు దరఖాస్తు చేసుకోగా అందుకు సంబంధించిన భూముల వివరాలు, మ్యాపింగ్, సాగులో ఉన్న రైతులు, వారి వివరాలు తదితర వాటిపై జేసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రీన్‌కో వారికి ఎంత వరకు అవసరమయ్యే విషయంపై త్వరలోనే నిర్ణయిస్తారన్నారు. భూములను పరిశీలించిన అనంతరం సంస్థకు కేటాయిస్తామని జేసీ అన్నారు. సర్వే చేసిన రిపోర్టు నివేదికను ప్రభుత్వానికి పంపుతామన్నారు.



భూముల వివరాలు అడిగి తెలుసుకుంటున్న జేసీ నిశాంతి

రేపు అరుణాచలంకు సూపర్ లగ్జరీ బస్సు

కర్నూలు(రాజ్‌విహార్): గిరి ప్రదక్షిణ దీపోత్సవం సందర్భంగా ఈ నెల 4వ తేదీన తమిళనాడులోని అరుణాచలంకు సూపర్ లగ్జరీ (హైటెక్) ప్రత్యేక బస్సు (సర్వీస్ నంబర్-93999) నడపనున్నట్లు కర్నూలు-2 డిపో అసిస్టెంట్ మేనేజరు దీప్తీ సుజన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు కొత్తబస్టాండ్ నుంచి శనివారం సాయంత్రం 6గంటలకు సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరి, మరుసటి రోజు తెల్లవారుజామున 4:30 గంటలకు అరుణాచలం చేరుకుంటుందన్నారు. గిరి ప్రదక్షిణ, అరుణాచలేశ్వర స్వామి దర్శనం, దీపోత్సవం అనంతరం తిరిగి అదే రోజు సాయంత్రం 4 గంటలకు బయలుదేరి, 6వ తేదీ ఉదయం 6గంటలకు కర్నూలుకు బస్సు చేరుకుంటుందని వెల్లడించారు. అరుణాచలం క్షేత్ర దర్శనం కోసం రాక, పోకలకు బస్సు చార్జీ రూ.2వేలు ఉంటుందని, ఇందులో ముందస్తు టిక్కెట్లు తీసుకునేందుకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించామన్నారు. వివరాలకు అసిస్టెంట్ మేనేజరు 7382871131 సెల్ నంబర్‌కు లేదా సమీపంలోని డిపోలలో సంప్రదించాలని సూచించారు.



యంత్రం ద్వారా శనగ కోతలు చేయిస్తున్న దృశ్యం



జొన్న ధాన్యాన్ని కుప్పగా పోస్తున్న యంత్రం

ముమ్మరంగా పంట కోతలు

దొర్నిపాడు: మండలంలో జొన్న, శనగ పంట కోతలు జోరుగా సాగుతున్నాయి. 3,509 ఎకరాల్లో జొన్న, 11,280 ఎకరాల్లో శనగ పంటలు సాగు చేశారు. రైతులు యంత్రాల ద్వారా కోతలు ముమ్మరం చేశారు. వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటుండటంతో రైతులు కోతలను వేగంగా చేయిస్తున్నారు. ప్రస్తుతం జొన్న క్వింటా రూ.2,600, శనగలు రూ.4,600 పలుకుతున్నాయి. అలాగే మిరప, పత్తి, మినుము పంటలు కోతలు కూడా కొనసాగుతున్నాయి.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ రాంబాబు

గోస్పాడు: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని నంద్యాల డీఎల్‌పీఓ రాంబాబు సూచించారు. మండల కేంద్రంలోని గ్రామ సచివాలయాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని, సమస్యల నిమిత్తం కార్యాలయం వద్దకు వచ్చే ప్రజలకు సిబ్బంది అందుబాటులో ఉండి సరైన సమాచారం అందించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. తాగునీటి పథకాలను సక్రమంగా నిర్వహించాలని, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తే రోగులు ప్రబలవని చెప్పారు. క్రమం తప్పకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. అనంతరం గ్రామాల్లో నిర్వహించాల్సిన పనులపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేంద్రుడు, సిబ్బంది పాల్గొన్నారు.

కేబుల్ పనులను అడ్డుకున్న గ్రామస్తులు

బండిఆత్మకూరు: జియో ఫైబర్ కేబుల్ పనులను గురువారం బండిఆత్మకూరు గ్రామస్తులు అడ్డుకున్నారు. బండిఆత్మకూరులోని కుందూనది మీద ఉన్న వంతెనపై కేబుల్ పనులను చేపట్టారు. ఇక్కడ కేబుల్ పైపును కింద ఉంచి పైన సిమెంటు దిమ్మెను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, ఉప సర్పంచి అవుటాల నాగేశ్వర రెడ్డి, మదీన చికెన్ సెంటరు నిర్వాహకులు ఇస్మాయిల్ తదితరులు అక్కడికి చేరుకుని పనులు చేస్తున్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దిమ్మె ఏర్పాటు చేయడం వల్ల వరదల సమయంలో నీరు గ్రామంలోకి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈఓఆర్డీ శ్రీనివాసులు, కార్యదర్శి నటరాజు అక్కడికి చేరుకొని అనుమతులు లేవని నిర్ధారించుకొని పనులను నిలిపి వేశారు.